సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర స్వామి ఆలయం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యింది. 8లో▸

మమతకు అదనపు బాధ్యతలు


సాక్షి, సిటీబ్యూరో: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి. మమతకు జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం బాధ్యతలు అదనంగా అప్పగించారు. ఆరోగ్యం – పారిశుద్ధ్యం అదనపు కమిషనర్‌గా ఉన్న బదావత్ సంతోష్ రెండు వారాల క్రితం బదిలీ కాగా అప్పటినుంచి ఆ బాధ్యతల్ని కమిషనర్ లోకేశ్‌కుమార్ తన వద్దే ఉంచుకున్నారు. తాజాగా పారిశుద్ధ్యం విభాగం బాధ్యతలను అదనంగా అప్పగించారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్ రూరల్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఉష గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలను ఫోన్ ద్వారా వివరించాలని కోరారు. సమస్యలను 99592 26287 నంబర్‌కు కాల్ చేసి తెలపాలని కోరారు.

ఏం చేద్దామబ్బా..!

- మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలపై అయోమయం
- ప్రభుత్వం నుంచి కరువైన స్పష్టత
- నోటీసులపై అధికారుల తర్జనభర్జన
- ఎటూ తేల్చుకోలేకపోతున్న కలెక్టర్, కమిషనర్లు
- ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీల్లో గందరగోళం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అవిశ్వాస తీర్మాన నోటీసుల ఆమోదంపై కలెక్టర్ సహా మున్సిపల్ కమిషనర్లు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో ఆమోదించాలా.. తిరస్కరించాలో తెలియక తర్జనభర్జన పడుతున్నారు. వాస్తవానికి సభ్యులు నోటీసులిచ్చిన 30 పని దినాల్లో ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. బలనిరూపణ పరీక్షకు తేదీ ప్రకటించాలి. కోరం మద్దతు పొందని వారిని ఆ పదవి నుంచి తప్పించి.. ఆ స్థానంలో కొత్తవారి ఎంపికకు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. సభ్యులు నోటీసులిచ్చి 20 రోజులవుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ అంశంపై ఇటు ప్రభుత్వం నుంచి అటు గవర్నర్ నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో కలెక్టర్ సహా కమిషనర్లు తల పట్టుకుంటున్నారు. ఇప్పటికే నోటీసులిచ్చిన సభ్యులు ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిందిగా కోరుతూ ఆయా అధికారులపై ఒత్తిడి తెస్తుండటంతో వారు కూడా ఏమీ చేయలేక చేతులెత్తేస్తున్నారు.

అయోమయంలో సభ్యులు

మున్సిపల్ యాక్ట్ కొన్ని సవరణలు (అవిశ్వాస తీర్మానం సమయం మూడేళ్ల నుంచి నాలుగేళ్లకు పెంచుతూ) చేస్తూ ప్రభుత్వం గత అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టింది. సభ్యులు ఆమోదించిన తర్వాత బిల్లును గవర్నర్ ఆమోదం కోసం పంపింది. ప్రభుత్వానికి గవర్నర్‌కు మధ్య ఏర్పడిన అంతరం కారణంగా బిల్లు చట్ట రూపం దాల్చకుండా అలాగే ఉండిపోయింది. జనవరి 27తో మున్సిపల్ పాలక మండళ్లు ఏర్పడి మూడేళ్లు పూర్తవుతోంది. బిల్లు చట్టరూపం దాల్చక పోవడంతో సవరణకు ముందు ఉన్న నిబంధనలే అమల్లోకి ఉన్నాయి. సభ్యులు దీన్ని అవకాశంగా తీసుకుని ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట, ఆదిబట్ల మున్సిపల్ చైర్ పర్సన్లకు వ్యతిరేకంగా అవిశ్వాస నోటీసులు ఇచ్చారు. వీరితో పాటు మరికొన్ని మున్సిపాలిటీల్లోనూ అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. ప్రభుత్వం నుంచి క్లారిటీ లేకపోవడంతో వారు మిన్నకుండిపోయారు. ఇప్పటికే నోటీసులిచ్చిన వారు మాత్రం అయోమయంలో పడిపోయారు. తమపై ఎక్కడ కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడతారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్యాంపునకు వెళ్లిన వారు వెనక్కి..

అవిశ్వాస నోటీసులిచ్చి.. క్యాంపులకు వెళ్లిన పెద్ద అంబర్‌పేట మున్సిపల్ కౌన్సిలర్లు తిరిగి ఇంటిముఖం పట్టారు. వీరు గత నెల 27న నోటీసులు అందజేశారు. అప్పటి నుంచి రెండు బృందాలుగా విడిపోయి క్యాంపులకు తరలివెళ్లారు. ఒక బృందంలో పదిహేను మంది.. మరో బృందంలో ఏడుగురు ఉన్నారు. ఒకరు ఉభయ గోదావరి జిల్లాలకు వెళ్లగా.. మరో బృందం గోవాకు వెళ్లింది. నోటీసులపై అటు ప్రభుత్వం నుంచి గానీ, ఇటు అధికారుల నుంచి గానీ స్పష్టత లేకపోవడంతో వారంతా నిరాశకు లోనయ్యారు. దీనికి క్యాంపు ఖర్చులు తడిసిమోపెడవుతుండటం.. రోజుల తరబడి ఇంటికి దూరంగా ఉండటం .. సొంత పనులు చేసుకోలేకపోతుండటం.. కార్యకర్తలు, పుర ప్రజల నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో చేసేది లేక వారంతా రెండు రోజుల క్రితమే ఇంటి ముఖం పట్టాల్సి వచ్చింది.



సమావేశంలో కలెక్టర్ హరీశ్ తదితరులు

డబుల్ బెడ్రూంలకు 3,086 మంది అర్హులు

వీసీలో సీఎస్‌తో కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం 8,979 దరఖాస్తులు రాగా, వీటిలో 3,086 మంది అర్హత కలిగి ఉన్నారని కలెక్టర్ హరీశ్ చెప్పారు. ఈ మేరకు గురువారం సీఎస్ శాంతకుమారి పోడుభూములు, కంటివెలుగు, 58, 59, 118 జీవోల కింద ఇళ్లు, స్థలాల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో కలిసి ఆయన మాట్లాడారు. 2,341 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 1,90,579 మందికి స్క్రీనింగ్ నిర్వహించామని తెలిపారు. 36,372 మందికి రీడింగ్ గ్లాసులు అందజేసినట్లు పేర్కొన్నారు. మరో 31,777 ప్రిస్కిప్షన్ గ్లాసులకు ఆర్డర్ పెట్టినట్లు వివరించారు. మార్చి 31 నాటికి మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఆస్తిపన్నులను వంద శాతం వసూలు చేయిస్తామని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు తిరుపతి రావు, ప్రతీక్‌జైన్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీఆర్‌డీఓ ప్రభాకర్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామేశ్వరం జాతరకు ప్రత్యేక బస్సులు

షాద్‌నగర్‌రూరల్: ఉత్తర రామలింగేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం నుంచి షాద్‌నగర్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ ఉష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు ప్రతిరోజు 20 ప్రత్యేక బస్సులను నడిపించనున్నట్లు వెల్లడించారు. కొందుర్గు మండల కేంద్రం నుంచి రామేశ్వరం వెళ్లేందుకు ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. షాద్‌నగర్ నుంచి వెళ్లే భక్తులకు రూ.30, కొందుర్గు నుంచి రూ.60 చార్జీలను వసూలు చేసేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయాలని ఆమె కోరారు.

న్యూస్‌రీల్

‘దళితబంధు’తో ఆర్థికంగా ఎదగాలి

పథకం రాష్ట్ర అడ్వైజర్ డాక్టర్ లక్ష్మారెడ్డి



దళితబంధు లబ్ధిదారుడితో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మారెడ్డి

కడ్తాల్:దళితబంధు పథకం లబ్ధిదారులు ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్లను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని, అభివృద్ధి చెందాలని ఆ పథకం రాష్ట్ర అడ్వైజర్ డాక్టర్ లక్ష్మారెడ్డి సూచించారు. గురువారం కడ్తాల్‌తో పాటు, మండలంలోని మర్రిపల్లి గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. యూనిట్ల నిర్వహణ, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. దళితబంధు పథకం లబ్ధిదారులు మర్రిపల్లి కృష్ణయ్య, పోతగళ్ల మహేశ్ నెలకొల్పిన పాడిపరిశ్రమను పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి లబ్ధిదారులకు పలు సూచనలు ఇచ్చారు. నెలకొల్పిన యూనిట్లను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. యూనిట్ల మంజూరుకు ముందు, ఇప్పుడు ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, మండల పశువైద్యాధికారి భానునాయక్, మిల్క్ సెంటర్ మేనేజర్ రాధిక, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు మహేశ్, కృష్ణయ్య, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్ల స్వాధీనం



ఆమనగల్లు: అక్రమంగా తరలిస్తున్న జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్న సంఘటన ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనంప్రకారం.. ఆమనగల్లు నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న బొలేరో వాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో ఆమనగల్లులోని పెట్రోల్‌బంక్ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. వాహనంలో 800 జిలెటిన్‌స్టిక్స్, 100 డిటోనేటర్లు, ఐడీఎల్ పౌడర్, కేబుల్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా చౌటుప్పల్‌కు చెందిన రాఘవేంద్ర ట్రేడర్స్ యజమాని శ్రీనివాస్ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండపేటకు చెందిన వెంకన్నగౌడ్ అనే వ్యక్తికి వీటిని సరఫరా చేస్తున్నట్లు డ్రైవర్ కొండూరు విజయ్ తెలిపాడు. కేసు నమోదు చేసిన పోలీసులు డ్రైవర్ విజయ్‌ను అరెస్ట్ చేసి బొలెరోను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సుందరయ్య తెలిపారు.

‘కంటి వెలుగు’పై అవగాహన తప్పనిసరి

జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి



రికార్డులను పరిశీలిస్తున్న నరహరి

షాద్‌నగర్: కంటి సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి వైద్య సిబ్బందికి సూచించారు. చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మొగిలిగిద్దలో గురువారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చే వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించారు, రికార్డుల నిర్వహణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తోందని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని వైద్య సిబ్బంది అధిగమించాలని అన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి శిబిరాలకు తరలించే బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. కంటి వైద్య శిబిరాలను ప్రజలందరు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు జయప్రకాష్, రమాదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్ వైజర్ చంద్రకళ, ఆనంద్, అమృత, భారతి, అశ్విని, సుజాత పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

చేవెళ్ల: యువత క్రీడలపై అసక్తి పెంచుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో గురువారం కేసారం గ్రామానికి చెందిన కాసుల రామ్‌గౌడ్, నాగారాజుగౌడ్ ఆధ్వర్యంలో కాసుల బాబయ్యగౌడ్, కాసుల జ్ఞానేశ్వర్‌గౌడ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈటోర్నమెంట్‌ను చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ డి. వెంకట్‌రెడ్డి, కేసారం సర్పంచ్ కె. రమేశ్‌గౌడ్, ఆగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అత్తెల్లి అనంత్‌రెడ్డితో కలిసి బండి సంజయ్ ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడలపై ఆసక్తి పెంచుకొని రాణించాలని సూచించారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని, క్రీడాస్ఫూర్తితో ఆడాలని చెప్పారు. గ్రామస్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు రాణించాలని కోరారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని చెప్పారు. ఇలాంటి పోటీలతో క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాలు మెరుగుపడుతాయని తెలిపారు. యువత చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్

క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కాసుల రాఘవేందర్‌గౌడ్, దయానంద్, లక్ష్మణ్, నాగారజు, ఆర్గనైజర్లు దర్శన్, రామ్, లక్కీ, బద్రి, కరుణాకర్‌రెడ్డి, శశాంక్, సువాస్‌గౌడ్, తులసీరామ్ విజయ్‌కుమార్, లక్ష్మీనివాస్, ఆర్మీ వెంకటేశ్, మీసాల వంశీ, కంజర్ల ప్రకాశ్, జంగారెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శర్వలింగం, సత్యనారాయణ, చాకలి శ్రీనివాస్, కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం


నందిగామ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే కన్నుమూశారు. ఈ సంఘటన నందిగామ శివారులో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామయ్య కథనం ప్రకారం.. షాద్‌నగర్ నుంచి ఇద్దరు యువకులు గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై కొత్తూరు వైపు వెళ్తున్నారు. నందిగామ శివారులోని ఎంఎస్ఎన్ పరిశ్రమ సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుల జేబులో లభించిన ఆధారాల మేరకు మహేశ్వరం మండలం అమీర్‌పేటకు చెందిన చాకలి శివ (23), నాగారం శ్రీకాంత్ అలియాస్ రాజు (23)గా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



యువకుల మృతదేహాలు

క్రమం తప్పకుండా క్రియా ధ్యానం చేయాలి

వైఎస్ఎస్ అంతర్జాతీయ అధ్యక్షుడు స్వామి చిదానందగిరి



మాట్లాడుతున్న స్వామి చిదానందగిరి

నందిగామ: నిరంతరం దైవంతో ఉండటమే నిజమైన సఫలతకు మార్గమని.. నిద్రించేముందు నిత్యం భగవంతుడిని ధ్యానించాలని.. తెల్లవారు జామున దైవ సన్నిధిలోనే మేల్కొని, ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని యోగాద సత్సంగ సొసైటీ, సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ (వైఎస్ఎస్) అంతర్జాతీయ అధ్యక్షుడు స్వామి చిదానందగిరి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కాన్హా శాంతి వనంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వైఎస్ఎస్ సంఘం ఆధ్యాత్మిక కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి చిదానందగిరి భక్తుల నుద్దేశించి మాట్లాడారు. కేవలం తర్కం మీదనే ఆధారపడితే అజ్ఞానంలో కూరుకుపోతామని, అంతకంటే ఉన్నతమైనదీ, శక్తివంతమైన ఆయుధం అవసరమని పేర్కొన్నారు. క్రియా యోగ సాధనతో సాత్వికమైన మెదడు, హృదయం, సాత్వికమైన నాడీ వ్యవస్థ అనే మూడు ఫలితాలు కలుగుతాయని సూచించారు. ఈ మూడు సాధించిన వ్యక్తి దృఢ సంకల్పం, దయార్థ హృదయంతో తనకు, సమాజానికి మంచి చేకూర్చే నిర్ణయాలు తీసుకొని పనిచేస్తాడన్నారు. ఇలా ఉన్నతంగా మారిన వ్యక్తులతోనే ప్రపంచమంతా సుఖ సంతోషాలతో వెల్లివిరుస్తుందని చెప్పారు. క్రియా యోగ గురు పరంపరలోని మహాగురువులు, వారి దయా హస్తాలతో రక్షణ హామీ ఇస్తున్నారని, వారి బోధనలను అనుసరించి వారిని ప్రార్థించినట్లయితే ఆత్మ సాక్షాత్కారం తథ్యమని, తద్వారా సాధకుడికి శాంతి, జ్ఞానం, ఆనందం లభిస్తాయని వివరించారు. నిరంతర ధ్యానంతో ఆత్మాలయం అనే ఆంతరిక దేవాలయంలో ఆత్మ పరమాత్మతో అనుసంధానం చెందినప్పుడు ఆత్మశక్తులన్నీ జాగృతమవుతాయని స్వామి చిదానందగిరి చెప్పారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా క్రియా ధ్యానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు గురూజీలు, స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి.. నింపాది

- జిల్లాలో 2022-23కు గాను పనిదినాల లక్ష్యం 63 లక్షలు
- ఇప్పటికి పూర్తయిన పనిదినాలు 26 లక్షలు
- మార్చి 31తో ముగియనున్న గడువు
- చివరలో అధికారుల హడావుడి
- కొత్త సాఫ్ట్‌వేర్‌తో ఇబ్బందులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

యాచారం: ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించేందుకు గడువు ముంచుకొస్తోంది. దీంతో అధికారులు హడావుడి చేస్తున్నారు. ఏడాది ప్రారంభంలో పనులు కల్పించే విషయంలో నిర్లక్ష్యం వహించి చివరి దశలో ఉపాధి పని దినాలు పెంచండని క్షేత్ర స్థాయి సిబ్బందిపై డీఆర్‌డీఏ ఉన్నతాధికారులు ఒత్తిడి పెంచుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లో డివిజన్ స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి కూలీల సంఖ్య పెంచండి, వారం, వారం వేతనాలు ఇస్తామని నమ్మించండి, అవసరమైతే గ్రామాల్లో దండోరా వేయించండి, ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకోండి అంటూ మెడపై కత్తిపెట్టి సుతిమెత్తగా హెచ్చరిస్తున్నారు. జిల్లాలో 2022-23 ఏడాదికి గాను దాదాపు రూ.162 కోట్లకుపైగా నిధులతో ఉపాధి కూలీలకు పని కల్పించాలన్నదే లక్ష్యం. మొత్తంగా 2,75,030 మంది కూలీలకు 2022 ఏప్రిల్ ప్రారంభం నుంచి 2023 మార్చి 31 వరకు 63,09,052 పని దినాలు కల్పించాలన్నదే లక్ష్యం. ఏడాది గడువు చివరికి వచ్చినా నేటికీ 26,20,861 పని దినాలే కల్పించారు. మరో 45 రోజులు మాత్రమే గడువు మిగిలి ఉండడంతో అధికారులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు.

ఆసక్తి చూపని కూలీలు

జిల్లా వ్యాప్తంగా 2,75,030 ఉపాధి కూలీలు ఉండగా, ఉపాధి పనులకు మాత్రం 1,29,329 మంది కూలీలే వెళ్తున్నారు. మిగతా 1,45,701 మంది ఉపాధి పనులపై ఆసక్తి చూపడం లేదు. దాదాపు పని చేసే కూలీల్లో 50 శాతం మేర వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకోవాల్సి ఉండగా ఈ ఏడాది కేవలం 502 మంది కూలీలు మాత్రమే వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్నారు. పనులు చేసిన కూలీలకు సకాలంలో వేతనాలు అందకపోవడం, సమృద్ధి వర్షాలతో వ్యవసాయ పనులు జోరుగా సాగుతుండడంతో కూలీలు ఉపాధి పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపలేదని భావిస్తున్నారు. కూలీల సంఖ్య అధికంగా ఉన్న యాచారం, మంచాల, కందుకూరు, మాడ్గుల, ఆమనగల్లు, తలకొండపల్లి తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి. వేతనాల అందే విషయంలో తీవ్ర ఆలస్యంతో త్వరగా డబ్బులొచ్చే వ్యవసాయ పనులకు వెళ్లడానికే కూలీలు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో 6 వేల మంది కూలీలు మాత్రమే ఉపాధి పనులకు వెళ్తున్నారు.

కొత్త సాఫ్ట్‌వేర్‌తో సమస్య

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఉపాధి నిధులు నేరుగా కూలీల ఖాతాల్లో జమ కావడం కోసం ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్) నూతన సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న రాగాస్ (రాష్ట్రీయ గ్రామీణ అభివృద్ధి సమాచారం) సాఫ్ట్‌వేర్‌ను పూర్తిగా రద్దు చేసింది. కొత్త సాఫ్ట్‌వేర్ మారడంతో ఉపాధి పనులు చేసే కూలీల రికార్డుల నమోదులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉపాధి కూలీలు పని ప్రారంభించే ఉదయం పూట, పని ముగించే మధ్యాహ్నం పూట ఫొటోతో కూడిన సమాచారం రికార్డు చేయాల్సి ఉంటుంది. గ్రామ స్థాయిలో 20 రకాల పనులనే గుర్తించడం, గుర్తించిన పనులు పూర్తి చేసిన తర్వాతే కొత్త పనుల నమోదు సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చారు. కూలీల ఖాతాలున్న బ్యాంకుల్లో గానీ, తపాలా కార్యాలయాల్లో గానీ ఆధార్ నంబర్ అనుసంధానం నిబంధన ఉంది. ఉపాధి పనులు చేసిన కూలీలకు కొన్నిసార్లు వేతనాలు రాక పోయే సరికి ఎవరిని అడగాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. టార్గెట్ ప్రకారం ఉపాధి పనులు పూర్తయితేనే కేంద్రం నుంచి గ్రామాల్లోని సీసీ రోడ్లకు ప్రత్యేక నిధులు మంజూరయ్యే అవకాశం ఉంటుంది.

జిల్లాలో ఉపాధి పనుల వివరాలు

- మొత్తం కూలీల సంఖ్య: **2,75,030**
- పనులకు వచ్చే కూలీల సంఖ్య: **1,29,329**
- మొత్తం పనిదినాల లక్ష్యం: **63,09,052**
- పూర్తయిన పనిదినాలు: **26,20,861**
- ఇంకా కల్పించాల్సినవి: **36,88,191**
- 2022-23కు మంజూరైన బడ్జెట్: దాదాపు రూ.**162**కోట్లు
- వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న కూలీలు: **502**
- ప్రస్తుతం ఉపాధి పనులు చేస్తున్న కూలీలు: **6,000**

కూలీల సంఖ్య పెంచుతున్నాం



ఉపాధి కూలీలకు జనవరి 31 వరకు చేసిన పనులకు సంబంధించి బకాయిలన్నీ వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా నిత్యం 5 వేల నుంచి 6 వేల వరకు ఉపాధి కూలీలు పనులకు వస్తున్నారు. కూలీల సంఖ్య పెంచడం కోసమే సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నాం. పనులు చేసిన వెంటనే బకాయిలు అందేలా కృషి చేస్తున్నాం. కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రభాకర్, పీడీ డీఆర్‌డీఓ

రేపటి నుంచి మల్లన్న జాతర

- ముస్తాబైన ఎక్వాయిపల్లి ఆలయం
- 5 రోజుల పాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ


కొలువుదీరిన మల్లన్న

కడ్తాల్: మండలంలోని ఏక్వాయిపల్లి సమీపంలో మల్లన్న గుట్టపై వెలసిన మల్లికార్జున స్వామి జాతర ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 22వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఐదు రోజుల పాటు భక్తుల మల్లన్నను దర్శించుకొని తరించనున్నారు. ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆహ్లాదకరమైన కొండపై వెలసిన మల్లన్న జాతరను ప్రతి ఏటా శివరాత్రి పర్వదినం రోజు నిర్వహించడం సంప్రదాయం. ఈ ఉత్సవాలను తిలకించేందుకు కడ్తాల్ మండల భక్తులతో పాటు కల్వకుర్తి, ఆమనగల్లు, మాడ్గుల్, తలకొండపల్లి, యాచారం, మాల్, చింతపల్లి, చరికొండ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివస్తారు. ఈ నెల 18న గణపతి పూజ, పంచామృత అభిషేకం, రాత్రికి శివ కల్యాణోత్సవం, ఒగ్గు కథ, 19న తెల్లవారుజామున అగ్నిగుండాలు, 20న ప్రత్యేక పూజలు, రాత్రికి రథోత్సవం, 21న ప్రత్యేక అర్చనలు, విశేష పూజలు, దీపోత్సవం, ఒగ్గు కథ, 22న చక్రతీర్థం, ఒగ్గు కథతో మల్లన్న ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు, ఆలయ ధర్మకర్త ఎట్టయ్య యాదవ్ తెలిపారు.

భక్తులు రాక..

శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారిపై కర్కల్ పహాడ్ గేట్ నుంచి ముద్విన్ వెళ్లే రహదారిపై 5కిలో మీటర్ల దూరంలో మల్లన్న ఆలయం ఉంది. భక్తుల కోర్కెలు తీర్చే దేవుడిగా ఈ ప్రాంత వాసులు మల్లన్నను దర్శించుకుంటారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తారు. ఇందు కోసం ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటి నుంచి రాజరాజేశ్వర బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన శివగంగ ఆలయం
- 17 నుంచి 21వ తేదీ వరకు వేడుకలు


గంగలో కొలువైన శివగంగ రాజరాజేశ్వర ఆలయం


పార్వతీదేవి

మహేశ్వరం: పట్టణంలోని శివగంగ రాజరాజేశ్వర స్వామి ఆలయం మహా శివ రాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యింది. శుక్రవారం నుంచి 21వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్ తెలిపారు. జిల్లాలోని శైవ క్షేత్రాల్లో ప్రసిద్ధమైనది శివగంగ రాజరాజేశ్వర ఆలయం ఒకటి. గంగలో శివపార్వతులు ఉండడం విశేషం. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. బ్రహ్మోత్సవాలకు మహబూబ్‌నగర్, హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్ తోపాటు పలు జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు.

ఆలయ చరిత్ర

కాకతీయుల కాలంలో రాజరాజేశ్వర స్వామి ఆలయం నిర్మాణం జరగడంతో ఈ గ్రామానికి మహేశ్వరమని పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతోంది. ఆలయ నిర్మాణం పద్మాకారంలో ఉంటుంది. గంగ మధ్యలో శివాలయం దాని చుట్టూ ఉన్న 16 ఆలయాలు పద్మరేకుల్లా ఉంటాయి. అద్భుత కళా నిర్మాణంతో ఉన్న ఈ ఆలయాన్ని తానీషా కాలంలో అక్కన్న, మాదన్నలు పునరుద్ధరించినట్లు ప్రతీతి. ఆలయంలోని అన్ని అష్టాదశంగా (18 సంఖ్య వచ్చేలా) నిర్మించడం విశేషం. శివ, పార్వతుల ఆలయాలతో పాటు మరో పదహారు ఆలయాలు దీని చుట్టూ కొలువుదీరాయి. శివగంగ నిర్మాణంలో కూడా నలువైపులా పద్దెనిమిది మెట్లను నిర్మించారు. సహజంగా శివుడి తల భాగంలో గంగ దేవి ఉంటుంది. ఇక్కడ మాత్రం గంగలోనే శివుడు ఉండడం చేత శివుడి కింది భాగంలో రాజరాజేశ్వరీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడి శివగంగలో పుణ్య స్నానమాచరిస్తే సమస్త దోషాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

చరిత్రలోకి వెళితే...

శివగంగ రాజరాజేశ్వర ఆలయాన్ని తానీషా నవాబు వద్ద మంత్రులుగా పని చేసిన అక్కన్న మాదన్నలు 1672లో పునరుద్ధరించారు. అప్పటి రాజధాని గోల్కొండ కోటకు పశ్చిమ భాగాన 37 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. శంషాబాద్, పెద్ద గోల్కొండ గ్రామాల మీదుగా అక్కన్న మాదన్నలు ఇక్కడికి చేరుకునేవారట. మహేశ్వరం ఆలయంతో పాటు సమీపంలో ఉన్న కొదండ రామస్వామి ఆలయం, శివగంగ పుష్కరిణీ, విష్ణుగంగ, ఆంజనేయ స్వామి ఆలయం కూడా అక్కన్న మాదన్నలు నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ఎనిమిది సంవత్సరాల కాలంలో ఆలయం నిర్మాణం పూర్తి చేశారు. 1677లో ఈ ఆలయం పునర్నిర్మాణంలో ఉన్నప్పుడు శ్రీశైలం దర్శనానికి వెళ్లిన శివాజీ కూడా మార్గమధ్యలో రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నట్లు చరిత్ర చెబుతోంది. వైభవంగా ఉన్న ఈ ఆలయంపై 1687లో మెఘల్ సామ్రాజ్యానికి చెందిన ఔరంగజేబు తన సైన్యంతో వచ్చి ఆలయంపై దాడి చేసి గుడిని ధ్వంసం చేసినట్లు చెబుతుంటారు. నాటి శిథిలాలు ఇప్పటికి ఉన్నాయి. ఆ తర్వాత కాలంలో అనేక మంది చొరవ తీసుకుని ఆలయాన్ని కొద్దికొద్దిగా అభివృద్ధి చేసుకుంటూ వచ్చారు.

శివగంగ చుట్టూ 16 శివాలయాలు

శివగంగ రాజరాజేశ్వర ఆలయం చుట్టూ పదహారు చిన్న ఆలయాలు కొలువై ఉన్నాయి. 1) హరిహరేశ్వరుడు, 2) మల్లీశ్వరుడు, 3) అవిముక్తేశ్వరుడు, 4)అఘోరేశ్వరుడు, 5) అమరేశ్వరుడు, 6) అమతేశ్వరుడు, 7) గంగాధరేశ్వరుడు, 8) ఇష్టకామేశ్వరుడు, 9) ముక్తేశ్వరుడు, 10) కాలహస్తీశ్వర, 11) ఏకాంబరేశ్వరుడు, 12) మణికర్ణికేశ్వరుడు, 13) మహానందీశ్వరుడు, 14)అమరావతీశ్వరుడు, 15) కపోతీశ్వరుడు, 16) మంగళ గౌరీశ్వర ఆలయాలు కొలువైనాయి. వీటితో పాటు శివగంగ రాజరాజేశ్వర ఆలయం చుట్టూ ఘట్టుపల్లిలో వీరాంజనేయ స్వామి ఆలయం, ఉత్తర దిశలో మంఖాల్‌లో మహంకాళీ మాత ఆలయం, శివాలయం కొలువైంది. రావిర్యాలలో జెన్నాయిగూడ శ్రీలక్ష్మినర్సింహ్మా ఆలయం, సిరిగిరిపురంలో శ్రీదేవి, భూదేవి అమ్మవారి ఆలయాలు ఉన్నాయి. ఇక్కడ ఒక శిలేఖనా (ఆయుధగారం) ఉండేది. ఆలయంలో ముందున్న చెట్టుకు ఓ చరిత్ర ఉంది. ఇందులో మూడు వృక్షాలు ఒకే చోట పెరిగాయి. రావి, వేప, మేడి చెట్లు పెరగడంతో త్రీవృక్ష మహత్యంగా పేర్కొంటారు.

ఇలా వెళ్లాలి...

హైదరాబాద్ నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి చేరుకోవడానికి చార్మినార్ నుంచి 253ఎం, 253టి, 253కె, 253హెచ్, సికింద్రాబాద్ నుంచి 8ఏ, 253ఎం, జూబ్లీ బస్సు డిపో నుంచి 253ఎం బస్సు సౌకర్యాలు ఉన్నాయి. నగరం నుంచే కాకుండా మహబూబ్‌నగర్ షాద్‌నగర్, కల్వకుర్తి, చెవేళ్ల, రాజేంద్రనగర్, అఫ్జల్‌గంజ్, ఫలక్‌నుమా, ఇబ్రాహీంపట్నం మరి కొన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నారు.

శివరాత్రికి ఆలయం ముస్తాబు

17వ తేదీ గణపతి పూజ, పుణ్యాహవాచనం, ధ్వజారోహణం, 18న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉదయం 5నుంచి రాత్రి 12గంటల వరకు రాజరాజేశ్వరుడితో పాటు చుట్టూ కొలువుదీరిన ఆలయాల్లో కుంకుమార్చన, సహస్ర నామార్చన, బిల్వార్చన, మంత్రపుష్పం, మంగళ హారతి, తీర్థప్రసాదాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక పూజలు, రాత్రి 8గంటలకు శివ పార్వతుల కల్యాణం జరుగుతుంది. 20న రుద్ర హోమం, రథోత్సవం, రాత్రి 9 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు గ్రామంలో రథం ఊరేగింపు, దాతలకు సన్మానం చేస్తారు. 21వ తేదీ ఉదయం 9 గంటలకు సామూహిక లలితా సహస్ర పారాయణం, రాత్రి 9గంటలకు దోపోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ వేడుకలకు మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునితా హాజరుకానున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

శివగంగ బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాం. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకోవాలి.

– సుధీర్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి


రాములు మృతదేహం

మొయినాబాద్: ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న డ్రైవర్ అదే ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. వెనుకనుంచి అతివేగంతో వచ్చిన కారు ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్ ఎగిరి రోడ్డుపై పడ్డాడు. ట్రాక్టర్ ట్రాలీ అతని పైనుంచి వెళ్లడంతో దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ మండల కేంద్రంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట్ జిల్లా దామరగిద్ద మండలం గద్వ గ్రామానికి చెందిన కిందిగెరి రాములు(42) మూడేళ్ల క్రితం బతుకుదెరువు కోసం మొయినాబాద్‌కు వలస వచ్చాడు. పట్టణంలోని కిరణ్ వే బ్రిడ్జ్ నిర్వాహకుడు కృష్ణారెడ్డి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం డస్ట్ లోడుతో ట్రాక్టర్‌ను మొయినాబాద్ నుంచి హిమాయత్‌నగర్ తీసుకెళ్తుండగా మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద వెనుకనుంచి అతివేగంతో వచ్చిన కారు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ రాములు ఎగిరి రోడ్డుపై పడ్డాడు. ట్రాక్టర్ ట్రాలీ అతని పైనుంచి దూసుకెళ్లింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండేళ్ల క్రితం మృతుని కొడుకు వంశీ(4) సైతం ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. మృతునికి భార్య పద్మ, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గోవర్ధన్ యాదవ్, ఉపాధ్యాయులు

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్

హుడాకాంప్లెక్స్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ అన్నారు. సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో టీఎస్ పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్న కేశవరెడ్డి ఎన్నికల కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెన్న కేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయులతో పాటు పీఈటీ భాషా పండితులకు పదోన్నతులను చేయిస్తామని తెలిపారు. మారుమూల ప్రాంతాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు సరైన విద్య అందించలేకపోతున్నామని, కొత్త రిక్రూట్‌మెంట్ ద్వారా ఉపాధ్యాయులను నియమించి పేద విద్యార్థులకు సరైన విద్య అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మధుసూదన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, రాష్ట్ర బాధ్యులు శ్రీధర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపాలి

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్


మహిళతో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

కేశంపేట: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రను పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేష్ ఆధ్వర్యంలో మండలంలోని చౌలపల్లి, సంతాపూర్, కొనాయపల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీర్లపల్లి శంకర్ ఆయా గ్రామాల్లో ప్రజలను నేరుగా కలుసుకుంటూ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ప్రజలకు వివరించారు. మళ్లీ గ్రామాల్లోకి బీఆర్ఎస్ నాయకులు వస్తే గత హామీలను ఎందుకు అమలు చేయలేదని నిలదీయాలన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్లను ఇవ్వలేదని అన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి మాటతప్పారని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం విపరీతంగా పన్నులు పెంచుతూ నిరుపేదల నడ్డి విరుస్తోందని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రూ. 500లకే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, నాయకులు రూప్లానాయక్, శ్రీధర్‌రెడ్డి, గిరి యాదవ్, నర్సింలు, సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం


ప్రమాదానికి గురైన కారు

తుర్కయంజాల్: కారు టైరు పేలడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటన గురవారం తుర్కయంజాల్‌లోని సాగర్ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు నుంచి వస్తున్న కారు తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు కట్ట మీదకి రాగానే ఒక్కసారిగా టైర్ పేలింది. దీంతో అదుపుతప్పి డివైడర్ ఎక్కి రోడ్డు అవతలి వైపునకు దూసుకెళ్లింది. ఎదురుగా వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులోని బెలూన్‌లు తెరుచుకోవడంతో అందులోని వారికి ఎలాంటి గాయాలు కాలేదు.